మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 227 10 శనివారం, ఫిబ్రవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

## ప్రజాస్వామ్యంలో రాచరికానికి
# తావులేదు



కృష్ణా జలాల్లో వాటాను వదులుకున్న కెసిఆర్-ఎపికి అనుకూలంగా కెసిఆర్ నిర్ణయాలు

కృష్ణాపరివాహక రైతులకు మరణశాసనం -జగన్‌తో లాలూచీ రాజకీయాలు

రాయలసీమను రతనాల సీమ చేస్తామని ప్రకటన-మన హక్కులను తాకట్టు పెట్టిన ఘనులు

వాహనాల రిజిస్ట్రేషన్ పేరు టిజిగా మార్పు-తెలంగాణ తల్లి విగ్రహంలోనూ మార్పులు

గ్రూప్ పరీక్షలు నిర్వహించి తీరుతాం-అసెంబ్లీ వేదికగా సిఎం రేంవత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి9(మరో ఉదయం):

మిగతా 2 లో

## ఆన్‌లైన్ ద్వారా మేడారం దేవతలకు బంగారం
### లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఫిబ్రవరి9(మరో ఉదయం):

అసెంబ్లీ కమిటీ హాలులో ఆన్‌లైన్ ద్వారా మేడారం సమ్మక్క-సారక్కలకు నిలువెత్తు బంగారం సమర్పించే కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఆన్‌లైన్ ద్వారా మేడారం సమ్మక్క, సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించే కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం తన మనవడు రియాన్ష్ నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. అలాగే తన మనవరాలి నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమర్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల కోసం అమ్మవార్లకు ఇచ్చే నిలువెత్తు బంగారాన్ని సమర్పించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. మేడారానికి వెళ్లలేని భక్తులు సమ్మక్క సారక్కలకు బంగారంగా భావించే బెల్లం సమర్పించే అవకాశంతో పాటు ప్రసాదం తెప్పించుకునే సదుపాయాన్ని రాష్ట్రప్రభుత్వం కల్పించింది. మీసేవ, పోస్టాఫీసులతో పాటు 'టీ-యాప్ ఫోలియో' యాప్ ద్వారా సేవలు పొందేలా ఏర్పాటు చేశారు.

## తెలంగాణ నుంచి బకాయిలు తెప్పించండి
### కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు
### రోజా సలహా



విశాఖపట్టణం,ఫిబ్రవరి9(మరో ఉదయం):

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక శాఖ మంత్రి రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. షర్మిల ఇప్పుడు ఏ పార్టీలో ఉందో అందరూ ఒక సారి గమనించాలన్నారు. జగన్మోహన్ రెడ్డిని జైలు పాలు చేసిన పార్టీతో షర్మిల చేతులు కలిపి ఏపీకి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం విశాఖ రైల్వే గ్రౌండ్‌లో ఆడుదాం - ఆంధ్రరాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. షర్మిలకు సలహా ఇస్తున్నాను... తెలంగాణాలో మీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కదా.. రేవంత్ రెడ్డి సర్కార్ నుంచి మనకి రావాల్సిన రూ. 6 వేల కోట్లు తీసుకురండని సూచించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ హయాంలో ఏపీకి రావాల్సిన రూ. లక్ష 80 కోట్ల ఆస్తులు రాబట్టాలని షర్మిలకు మంత్రి రోజా సూచించారు. ఇప్పుడు రాష్ట్రంలో టూర్‌లు పెట్టి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో పోరాటం చేస్తా అని చెప్పిన షర్మిల.. తన పార్టీని కాంగ్రెస్‌లో ఎందుకు విలీనం చేశారో చెప్పాలన్నారు. ఏపీలో ఏ లబ్ది పొందడానికి కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నారో ఆమె తెలపాలని డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే కాంగ్రెస్ మీద ఉమ్మేసే వాళ్ళని చెప్పి.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని కాంగ్రెస్‌లో మళ్ళీ జాయిన్ అయ్యారో షర్మిల చెప్పాలని మంత్రి రోజా డిమాండ్ చేశారు.

## భారతరత్నం మన పివి

పివి,చరణ్‌సింగ్,స్వామినాథన్‌లకు భారతరత్న

ఇప్పటికే కర్పూరీ ఠాకూర్, అద్వానీలకు ప్రకటన

ఈ యేడాది ఏకంగా ఐదుగురికి భారతరత్న

పివి దార్శనికతను కొనియాడిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(మరో ఉదయం)

మిగతా 2 లో



## భూతద్దం పెట్టి వెతికినా ఏపీలో
# అభివృద్ధి కనిపించదు

అమరావతి : మరో ఉదయం



ఏపీలో అధికార వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్ పాలనపై ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. తునిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, భూతద్దం పెట్టి వెతికినా అభివృద్ధి కనిపించదని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు జగన్ దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేశారని, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక హోదా ను పక్కన పెట్టారని విమర్శించారు.ఏపీలో మూడు రాజధానుల పేరిట మభ్యపెట్టి ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు, జగన్ పాలనలో రాష్ట్రానికి 10 పరిశ్రమలైన రాలేదని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రావాలంటే ఒక్క అవకాశం కాంగ్రెస్‌కు ఇవ్వాలని కోరారు.

# అగ్గిపెట్టె ముచ్చట
### రేవంత్‌పై హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్ : మరో ఉదయం

శాసనసభలో పదేపదే బీఆర్ఎస్ నాయకత్వాన్ని విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్ ఏదైనా మాట్లాడితే.. అగ్గిపెట్టె ముచ్చట తీసుకువస్తారు. అది సరికాదని హరీశ్‌రావు అన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు.ఏదన్నా మాట్లాడితే.. అగ్గిపెట్టె ముచ్చట తీసుకువస్తారు సీఎం. నాడు అమరవీరులకు కాంగ్రెస్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించలేదు. అమరవీరుల కుటుంబాలను పరామర్శించలేదు. కాంగ్రెసోళ్లు అమరవీరుల పాడే మోసినోళ్లు కాదు. తుపాకులతో ఉద్యమకారులను బెదిరించిన మీకు తెలంగాణ పోరాటం, అమరవీరులకు గురించి తెలుస్తదని అనుకోను. ఇక అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డు లాగా ఈ అగ్గిపెట్టె ముచ్చట మాట్లాడటం బంద్ చేయండి. తమను కించపరిచి, రాజకీయంగా విమర్శిస్తాం అనుకుంటే.. అది మీ రాజకీయ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని హరీశ్‌రావు అన్నారు.ఎస్ఎల్‌బీసీ విషయంలో సభను తప్పుదోవ పట్టించారు సీఎం రేవంత్ రెడ్డి. పదేండ్లలో కిలోమీటర్ తవ్వారు అని మొన్న ప్రెస్‌మీట్‌లో రేవంత్ చెప్పారు. ఈ పదేండ్లలో కిలోమీటరున్నర తవ్వారు అని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11 కిలోమీటర్లు తవ్వినట్లు హరీశ్‌రావు గుర్తు చేశారు. దీన్ని సీఎం కరెక్షన్ చేసుకోవాలి. ఇంకోసారి మాట్లాడేప్పుడు అవగాహనతో మాట్లాడాలని రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు.నాగార్జున సాగర్ విషయంలో కూడా సీఎం సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. శ్రీశైలం ఏపీ ప్రభుత్వం కంట్రోల్‌లో, నాగార్జున సాగర్‌ను తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్‌లో ఇచ్చారు. ఎన్నికలు జరిగే సమయంలో సాగర్‌ను ఏపీ కంట్రోల్‌లోకి తీసుకుంది. రెండు నెలలు గడుస్తున్నప్పటికీ సీఆర్పీఎఫ్ భద్రతలో సాగర్ ఉంది. శ్రీశైలం కూడా ఏపీ హయాంలో ఉంది. సాగర్‌ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకునేందుకు కృషి చేయాలి. దీనికోసం సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ నేతల ఆసక్తి

ఖమ్మంపై కన్నేసిన రేణుకాచౌదరి

స్థానిక కార్యక్రమాల్లో బిజీగా నేతలు

ఖమ్మం,ఫిబ్రవరి9(మరో ఉదయం):




లోక్‌సభ ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉంది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు రానున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో సీట్లు ఆశిస్తున్న నేతలు మెల్లగా తమ స్థానాలను పదిలపర్చుకునే ఎత్తుల్లో ఉన్నారు. ప్రధానంగా ఖమ్మం సీటు కోసం పలువురు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో మాజీకేంద్రమంత్రి రేణుకా చౌదరి మరోమారు పోటీకి ఆసక్తి చూపిస్తున్నారు. ఖమ్మంలో పాగా వేయాలని బిఆర్ఎస్ కూడా ఉత్సాహంగా ఉంది. ఇక్కడ పోటీకి కమలం పార్టీ కూడా రంగం సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బహుముఖ పోటీకి అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి రేణుకా చౌదరి, బిఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎంపి నామా నాగేశ్వర రావు, బిజెపి నుంచి పొంగులేటి సుధాకర్ రెడ్డి, పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది ఈ క్రమంలో గతంలో ఎప్పుడు లేనంతగా ఖమ్మంలో రాజకీయ వేడి పుడుతోంది.

# భారతరత్న కేంద్రం సరికొత్త రికార్డు..

## ఒకే ఏడాది ఐదుగురికి భారతరత్న..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 :**




లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవార్డుల పంట పండించింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏకంగా ఐదుగురికి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ప్రకటించింది. ఇటీవలే బీజేపీ అగ్రనేత ఎల్ కే అద్వానీ, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌లకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌరపురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం మరో ముగ్గురికి ఈ పురస్కారాన్ని ప్రకటించింది. తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్రం 'భారత రత్న' ప్రకటించింది. దీంతో ఈ ఏడాది ఏకంగా ఐదుగురికి అవార్డులు ప్రకటించినట్లైంది. దేశంలో అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'. ఏదైనా రంగంలో విశేష కృషి చేసిన పౌరులకు కేంద్రం ఈ పురస్కారంతో సత్కరిస్తుంటుంది. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఇప్పటివరకు నలభై మందికిపైగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వారిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది. ఏటా ఈ పురస్కారాన్ని ముగ్గురికి మాత్రమే ప్రకటిస్తుంటారు. దేశ ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి ఏడాదికి గరిష్ఠంగా ముగ్గురిని ఈ పురస్కారానికి సిఫారసు చేయవచ్చు. కానీ, దీనికి పరిమితి మాత్రం లేదు. 1999లో ఈ పురస్కారాన్ని నలుగురు వ్యక్తులకు ప్రదానం చేశారు. అంతే అప్పటి నుంచి ఏడాదికి ముగ్గురికి మాత్రమే ప్రకటిస్తూ వస్తున్నారు. అయితే, ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు ఏకంగా ఐదుగురికి భారత రత్న వరించడం విశేషం. కాగా, ఈ ఏడాది భారతరత్న అవార్డులను ప్రకటించిన ఐదుగురిలో నలుగురికి మరణానంతరం అవార్డు వరించింది. ప్రస్తుతం అవార్డుకు ఎంపికైనవారిలో ఎల్‌కే అద్వానీ మాత్రమే జీవించి ఉన్నారు.

# ఎస్సైకు సన్మాన కార్యక్రమం

**అల్లంపూర్ మరో ఉదయం న్యూస్:**

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శాంతినగర్ ఎస్సై సంతోష్ ని వడ్డేపల్లి మండల జడ్పిటిసి కాశపోగు రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్కెట్ యార్డు డైరెక్టర్ పైపాడు మహేష్ నరేంద్ర వర్మ శేఖర్ ప్రకాష్ ఆంజనేయులు లక్ష్మణ్ రవి గౌడ్ మత్తు నరేష్ రాయల్ రత్నం రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# అందులకు అన్నదానం

**అలంపూర్ మరో ఉదయం న్యూస్:**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న అందులో ఆశ్రమ పాఠశాలలో 80 మంది విద్యార్థినీ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ దంపతులు రవి మమత ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు నిర్వాహకులు రవి మమతలకు కృతజ్ఞతలు తెలిపి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ సేవా సమితి అస్లం మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని సాటి మనిషికి సాయం చేసే గుణం అందరికీ ఉండాలని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం కూడా ఒక అద్భుతమే అని భావించి కరస్పాండెంట్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆశ్రమ నిర్వాహకులు రంగన్న సిబ్బంది పాల్గొన్నారు



# 5వ శక్తి పీఠానికి 14న గవర్నర్ రాక

**అల్లంపూర్ మరో ఉదయం న్యూస్ :**

ఈ నెల 14వ తేదిన అలంపూర్ ఐదవ శక్తిపీఠమైన జోగుళాంబ దేవి వార్షిక బ్రహ్మోత్సవాలకు గవర్నర్ తమిళసై సౌందర రాజన్ రానున్నారు. ఈ మేరకు శుక్రవారం హైద్రాబాద్ లోని రాజ్ భవన్ లో ఆలయ ఇఓ పురంధర్ కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య ,ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ,జోగుళాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గవర్నర్ తమిళ సై సౌంజర్ రాజన్ ను కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అలాగే అమ్మవారి జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రతినిధులు మాట్లాడుతూ ఏడాదిలో ఒక సారి మాత్రమే జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది అని అన్నారు. ఆ రోజు అమ్మవారిని దర్శనం చేసుకోవడం మహాభాగ్యం అని చెబుతూ ఆహ్వానించారు.



మొదటి పేజీ తరువాయి

# ప్రజాస్వామ్యంలో రాచరికానికి తావులేదు

కృష్ణా జలాల్లో వాటాను వదులుకున్న ఘనత కెసిఆర్‌దని, ఎపికి అనుకూలంగా కెసిఆర్ నిర్ణయాలు తీసుకున్నారని, కృష్ణాపరివాహక రైతులకు మరణశాసనం రాశారని, ఇప్పుడేమో డ్రామాలు ఆడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. జగన్‌తో లాలూచీ రాజకీయాలు నడిపిందెవరని ప్రశ్నించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని ప్రకటన చేసింది నిజం కాదా అని అన్నారు. మన హక్కులను తాకట్టు పెట్టిన ఘనులు వారు కాదా అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షింగా కృష్ణాజలాపై చేసిన అన్యాయాలు మొదలు అందెశ్రీ, గూడ అంజయ్య, గద్దర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, అమరవీరులకు జరిగిన అవమానాలపై సిఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్‌ను ఏకి పారేశారు. ప్రజాస్వామ్యంలో రాచరికం ఉండకూడదని భావిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాద తీర్మానంపై మాట్లాడారు. కృష్ణా నదీ జలాలు, ఆ నదిపై ఉన్న ప్రాజెక్టులు క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందన్న వాదనను రేవంత్ రెడ్డి ఖండించారు. 2014 నుంచి 23 వరకూ కేఆర్ఎంబీ సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు కేసీఆర్ వెళ్లారని.. తాము ఇంత వరకూ ఏ సమావేశాలకు వెళ్లలేదని అన్నారు. ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటున్న మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీకి వెళ్లి ఆమరణ నిరాహార దీక్ష చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. అలా కాకుండా నల్లగొండలో ధర్నా చేస్తామనడం దారుణమని అన్నారు. అలాగే తాము చేస్తున్న పోరాటాలకు కలసి రావాలన్నారు. కృష్ణా నదీ జలాల విషయంలో చేసిందంతా చేసి ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెడుతున్నారని మండిపడ్డారు. జగన్‌కు దావత్ ఇచ్చి డైనింగ్ టేబుల్ మీద పునాదిరాయి వేశారని అన్నారు. రోజా ఇంట్లో విందు చేసి రాయలసీమ అభివృద్ధికి పాటుపడతానని సిఎం కెసిఆర్ అనలేదా అని అన్నారు. ఈ హామితోనే ఎపి సిఎం జగన్ కృష్ణా ప్రాజెక్టుకు పొక్క పెట్టారని అన్నారు. దీంతో ఇప్పుడు తెలంగాణ ప్రయోజనాలను కెసిఆర్ పూర్తిగా పణంగా పెట్టారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ ఉద్యమ సమయంలో వాహనాలు, బోర్డులపై అందరూ టీజీ అని రాసుకున్నారు. కొందరు యువకులు తమ గుండెలపై టీజీ అని పచ్చబొట్టు వేయించు కున్నారు. కేంద్రం తమ నోటిఫికేషన్‌లో టీజీ అని పేర్కొంది. అందరి ఆకాంక్షలకు విరుద్ధంగా గత ప్రభుత్వం తమ పార్టీ పేరు గుర్తొచ్చేలా టీఎస్ అని పెట్టింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేం రాష్ట్ర అక్షరాలను టీజీగా మార్చాలని నిర్ణయించామని

అన్నారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో రాచరిక ఆనవాళ్లు ఉన్నాయి. తెలంగాణ తల్లి అంటే.. మనకు అమ్మ, అక్క, చెల్లి గుర్తు రావాలి. మన ఆడబిడ్డలు కిరీటాలు పెట్టుకుని ఉండలేదు. తెలంగాణ తల్లి అంటే గడీలో ఉండే మహిళ కాదు.. శ్రమజీవికి ప్రతీకగా ఉండాలి. అందెశ్రీ అనే కవి తెలంగాణకు గొప్ప గీతాన్ని అందించారు. జయజయహే గీతం తెలంగాణ ఉద్యమంలో అందరికీ స్ఫూర్తినిచ్చింది. రాష్ట్రం వచ్చాక జయజయహే రాష్ట్ర గీతం అవుతుందని అందరూ ఆశించారు. కానీ, ఆ పాటను నిషేధించినంత పని చేశారు. అందుకే అందెశ్రీ గీతాన్ని రాష్ట్రగీతంగా చేస్తున్నామని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే బాగుండని విపక్షం కోరుకుంటోంది. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదు. ప్రధాన విపక్షనేత సీటు ఖాళీగా ఉండటం సభకు శోభనీయం కాదు. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. పరిస్థితిని చక్కదిద్దుతూ ఈ ప్రభుత్వం ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చింది. మంచి పనులను అభినందించే సద్బుద్ధి విపక్ష నేతలకు లేదని సీఎం విమర్శించారు. కొట్లాడి తెచ్చుకన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు సూచనలు ఇచ్చి ఉంటే బాగుండేదని సీఎం అన్నారు. సభకు రాకపోవడం అసెంబ్లీ మర్యాదను అవమానించినట్లే అన్నారు. ప్రతి పక్ష నేతలు ఇప్పటికైనా సరైన పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్రంలో రాచరిక పోకడలు పోవాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే రాష్ట్ర అధికారిక చిహ్నం మారుస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసింది. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిని తీసుకొచ్చింది. మా సర్కార్ సంక్షేమ పథకాలు అమలు చేసి సరిగ్గా రెండు నెలలు.. ప్రతిపక్ష నేతలు అప్పుడే విమర్శలు మొదలు పెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అంటే కేవలం భౌగోళిక ప్రాంతమే కాదు.. ఒక ఎమోషన్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఎంతో అమరుల త్యాగాలతో తెలంగాణ వచ్చిందన్నారు. పోరాటంలో అడుగడుగునా ఉద్వేగపూరితమైన సంఘటనలే కనిపిస్తాయన్నారు. అనేక మంది ఉద్యమకారులు, విద్యార్థులు సొంత రాష్ట్రం తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 60 యేళ్ల సుదీర్ఘ పోరాటంలో కన్న కలలు నిజం చేసుకోవాలన్న ఆశతో తమ జీవితంలో వెలుగు వస్తుంది ప్రజలు ఆకాంక్షించారన్నారు. అయితే తొమ్మిదిన్నరేళ్లలో అవి నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో జూనియర్ ఆర్టిస్ట్ ఉన్నారని, ఈ మధ్య ఆయన ఆటోలు ఎక్కడి డ్రామాలు మొదలుపెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పరోక్షంగా మాజీ మంత్రి కేటీఆర్ ను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు పథకం ఉండగా.. ఆటో వారిని బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోతున్నా మని ఎవరైనా ఆటోను తగలబెట్టుకుంటారా అని రేవంత్ రెడ్డి నిలదీశారు. రైతులకు రైతు బంధు పడలేదంటూ ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2018-19 యాసంగి రైతుబంధు వేయడానికి 5 నెలల సమయం తీసుకున్నారని గుర్తుచేశారు. 2019-20లో రైతు బంధు వేయడానికి 9 నెలలు పట్టిందని పేర్కొన్నారు. 2020-21లో రైతు బంధు వేయడానికి 4 నెలలు పట్టిందని, 2021-22లో 4 నెలలు తీసుకున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చి 2 నెలలు కాకుండానే రైతుబంధు ఇవ్వలేదని రెచ్చగొడుతున్నారు సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో రైతు బంధు వేస్తామని చెప్పినం.. అయినాసరే రైతుబంధు వేయలేదని రైతులను రెచ్చగొడుతున్నారు సీఎం తెలిపారు.జయజయహే గీతం తెలంగాణ ఉద్యమ సమయంలో అందరికీ స్ఫూర్తి ఇచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆ పాట రాష్ట్ర గీతం అవుతుందని అంతా భావించినా.. ఆ పాటను నిషేధించినంత పని చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించాం. తెలంగాణ తల్లి అంటే మనకు అమ్మ, అక్క, చెల్లి గుర్తు రావాలి. తెలంగాణ ఆడబిడ్డలు కిరీటాలు పెట్టుకుని ఉండలేదు. తెలంగాణ తల్లి శ్రమజీవికి ప్రతీకగా ఉండాలి.' అంటూ సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో గ్రూప్ 1 అభ్యర్థులకు అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ గుడ్ న్యూస్ చెప్పారు. వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచి త్వరలోనే గ్రూప్ 1 పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. కొన్ని నిబంధనల వల్ల ప్రక్షాళన ఆలస్యమైందని.. నలుగురి ఉద్యోగాలు పోయిన దుఃఖంలో విపక్ష నేతలు 2 లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నపత్రాలు విక్రయించి ఉద్యోగాలు భర్తీ చేసే వాళ్లం కాదని, ప్రభుత్వ శాఖల్లో బంధువులను పెట్టుకుని ఉద్యోగాలు అమ్ముకునే వాళ్లం కాదని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# భారతరత్నం మన పివి

దేశాన్ని ఆర్థిక అస్థిరత నుంచి సుస్థిరతకు మళ్లించి..ప్రపంచం ముందు గర్వంగా తలెత్తుకుని నిలిచేలా చేసిన భారత మాజీ ప్రధాని, తెలుగు తేజం పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించింది. మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌లకు సైతం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఇటీవలే.. ఎల్ కే అద్వాణీ, కర్పూరీ ఠాకూర్‌కు కూడా కేంద్రం భారతరత్న పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రికార్డు స్థాయిలో ఈ ఏడాది మొత్తం ఐదుగురికి భారతరత్న అవార్డులు ప్రకటించినట్టయ్యింది. సాధారణంగా ఏడాదికి 3 భారతరత్న అవార్డులు ఇస్తారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం ఐదుగురికి ప్రకటించడం విశేషం. ఈరంతా ఉద్దండులే కావడం విశేషం. చౌదరి చరణ్ సింగ్ జూలై 28, 1979 నుంచి జనవరి 14, 1980 మధ్యకాలంలో, పీవీ నరసింహారావు జూన్ 21, 1991 నుంచి మే 16, 1996 వరకు దేశ ప్రధానమంత్రులుగా సేవలు అందించారు. ఇక హరితవిప్లవ పితామహుడైన ఎంఎస్ స్వామినాథన్ దేశానికి ఎనలేని సేవలు అందించారు. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్ ( ట్విటర్)' వేదికగా వెల్లడించారు. దేశానికి వీరు అందించిన సేవలను కొనియాడారు. తాజా ప్రకటనతో ఈ ఏడాది మొత్తం ఐదుగురిని ఈ పురస్కారం వరించింది. అంతకుముందు భాజపా అగ్రనేత ఎల్‌కే అద్వాణీ, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకుర్‌కు 'భారతరత్న' ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం.. దేశాన్ని సాంస్కృతికంగా, మేధోపరంగా సుసంపన్నం చేసిందని ప్రధాని మోదీ కొనియాడారు. మాజీ ప్రధాని చరణ్ సింగ్, శాస్త్రవేత్త స్వామినాథన్ కృషిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. భారతదేశ ఐదో ప్రధానిగా పనిచేసిన దివంగత చౌదరి చరణ్ సింగ్ రైతుల సంక్షేమం కోసం చేసిన అచంచలమైన అంకితభావానికి మరణానంతరం భారతరత్నతో సత్కరించుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత హోం మంత్రిగా పని చేసిన చరణ్ సింగ్ రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చేసిన ప్రతిఘటన, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత దేశానికి స్ఫూర్తినిచ్చేవిగా నిలిచాయి. దేశానికి ఆయన చేసిన సాటిలేని సేవలను గౌరవించడం ప్రభుత్వానికి దక్కిన అదృష్టం అని ప్రధాని మోదీ కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును భారతరత్నతో సత్కరించడం ఆనందంగా ఉంది. ప్రముఖ పండితుడు, రాజకీయవేత్త అయిన నరసింహారావు వివిధ హోదాలలో విస్తృత సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంటు, అసెంబ్లీ సభ్యునిగా ఎన్నో ఏళ్లుగా ఆయన విశేష కృషి చేశారు. భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో, దేశ శ్రేయస్సు, అభివృద్ధికి బలమైన పునాది వేయడంలో దూరదృష్టి గల నాయకత్వం కీలక పాత్ర పోషించింది. నరసింహారావు ప్రధానిగా పనిచేసిన కాలం ఆర్థికాభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలికిందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తున్నట్లు ప్రకటించారు. దేశానికి చేసిన విశేష కృషికి గానూ భారతరత్న ఇవ్వడం సంతోషకరమైన విషయమని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సంక్షేమానికి వ్యవసాయం, రైతులు మూలస్తంభాలు. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు వ్యవసాయంలో తీసుకువచ్చిన మార్పులు పెనుమార్పులు తీసుకువచ్చాయి. భారతీయ వ్యవసాయాన్ని ఆధునీకరించే దిశగా చాలా ప్రయత్నాలు చేశారు. ఒక ఆవిష్కర్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఆయన ముందుచూపు వ్యవసాయ రూపరేఖలు మార్చడమే కాకుండా ఆహార భద్రతకు హామీ ఇచ్చిందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కీ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటన పై హర్షం

## ప్రధాని నరేంద్రమోడీ కీ కృతజ్ఞతలు తెలిపిన - సామాజిక కార్యకర్త, పివి సేవా సమితి అధ్యక్షులు పిడిశెట్టి రాజు



**సిద్దిపేట జిల్లా : ఫిబ్రవరి09, (హుస్నాబాద్ నియోజకవర్గం / కోహెడ మండలం )**

భారతదేశ నూతన ఆర్థిక సంస్కరణల పితామాహుడు, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కీ భారత దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్న వరించడం పట్ల ప్రముఖ సామాజిక కార్యకర్త, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పిడిశెట్టి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మేధావులు, తెలుగు తొలి ప్రధాని పివి నరసింహారావు కీ భారతరత్నతో సత్కరిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. విశిష్ట పండితుడు మరియు రాజనీతిజ్ఞుడిగా, నరసింహారావు భారతదేశానికి వివిధ హోదాలలో విస్తృతంగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, అనేక సంవత్సరాల పాటు పార్లమెంటు, శాసనసభ సభ్యునిగా చేసిన కృషిని ఆయన సమానంగా గుర్తుంచుకుంటారు. భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో అతని దూరదృష్టి గల నాయకత్వం కీలకపాత్ర పోషించింది, దేశం యొక్క శ్రేయస్సు మరియు అభివృద్ధికి బలమైన పునాది వేసింది. ప్రధానమంత్రిగా నరసింహారావు పదవీకాలం భారతదేశాన్ని ప్రపంచ మార్కెట్లకు తెరిచిన ముఖ్యమైన చర్యలతో గుర్తించబడింది, ఇది ఆర్థిక అభివృద్ధి యొక్క కొత్త శకాన్ని ప్రోత్సహిస్తుంది. ఇంకా, భారతదేశం యొక్క విదేశాంగ విధానం, భాష మరియు విద్యా రంగాలకు ఆయన అందించిన సహకారం భారతదేశాన్ని క్లిష్టమైన పరివర్తనల ద్వారా నడిపించడమే కాకుండా దాని సాంస్కృతిక మరియు మేధో వారసత్వాన్ని సుసంపన్నం చేసిన నాయకుడిగా అతని బహుముఖ వారసత్వాన్ని నొక్కి చెబుతుంది.ఆ మహానుభావుడికి మరియు మాజీ ప్రధాని చరణ్ సింగ్, హరిత విప్లవ పీతామాహుడు ఏం ఏస్ స్వామినాథ్ లకు భారతరత్న ప్రకటన పట్ల భారత కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ జీ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు, ధన్యవాదములు

మరో ఉదయం

# మహాలక్ష్మి పథకం దరఖాస్తులు విచారణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి

## కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు ఫిబ్రవరి 09 మరో ఉదయం**



మహాలక్ష్మి పథకం దరఖాస్తులు విచారణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో దరఖాస్తులు విచారణ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందేచేసిన దరఖాస్తుల్లో గ్యాస్ నంబర్ నమోదులో తప్పిదాలను సవరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే బృందాలను నియమించడం జరిగిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ అందించనున్న నేపథ్యంలో ప్రజాపాలన దరఖాస్తుల విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. దరఖాస్తులు విచారణ, ఆన్లైన్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ నెల 10 వరకు విచారణ ప్రక్రియ పూర్తి చేయుటకు ప్రతి గ్రామ పంచాయతీకి 4 టీములు, అలాగే మున్సిపల్ వార్డుకు ఇద్దరిని నియమించి ఆన్లైన్ చేసేందుకు లాగిన్స్ ఇచ్చినట్లు చెప్పారు. విచారణకు వచ్చే టీములకు ప్రజలు గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగ దారుని నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూర్చలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచేసేందుకు ప్రత్యేక యాప్ ను రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్ లో లబ్ధిదారుల వివరాలను సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీఓలు, తహశీల్దార్ లు, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి అర్జున్,మున్సిపల్ కమిషనర్ రఘు, కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, ఈడీఎం విజయసారథి, కౌన్సిలర్ జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి మహేందర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9:**

మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి గురువారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ తదితరుల సమక్షంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నూతన పాత్రపై మా శుభాకాంక్షలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, కుమారుడు పట్నం రీనీష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, షాద్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

### సమ్మెకు సంబంధించిన గోడ పత్రిక విడుదల

### ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి

### ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ పిలుపు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 :**

కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజా,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందున ఫిబ్రవరి 16వ తేదీన దేశంలో ఉన్న కేంద్ర కార్మిక సంఘాలు అన్ని కూడా కలిసి దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ ను చేపట్టడం జరిగింది ఈ సమ్మెను విజయవంతం చేయాలని ఈరోజు చేవెళ్ల మండలములో ఉన్న అనెక్స్ గ్లాస్ కంపెనీ దగ్గర కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ హాజరై కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మోడీ వచ్చిన తర్వాత కార్మికులపై దాడి మొదలు పెట్టాడని పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు కోడ్ లుగా చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడని అదేవిధంగా రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి 700 మంది రైతుల చావుకు కారకుడు అయ్యాడని కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానం గా మారుస్తూ జీవోలు తీసుకు వస్తున్నాడని కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని నూతన పెన్షన్




విధానాన్ని రద్దు చేయాలని 18 డిమాండ్ల పైన ఈ సమ్మె జరుగుతుందని ఈ సమ్మెలో కార్మికులు కర్షకులు రైతులు ప్రజలు అందరూ పాల్గొని ఈ సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి శివయ్య మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి బి కే యం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల రమాదేవి కార్మికులు మాధవరెడ్డి రంజిత్ లింగం గౌడ్ శ్రీకాంత్ భాస్కర్ రామచందర్ ప్రభాకర్ సునీల్ రాజు ఐలయ్య కృష్ణ శ్రీను లక్ష్మయ్య కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# మేడారం సమ్మక్క సారక్క జాతర రద్దీ దృష్ట్యా వాహనాల మళ్లింపు చేపట్టాలి

### సామాజిక కార్యకర్త కర్నే రవి

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు ఫిబ్రవరి : 09 మరో ఉదయం**

మణుగూరు సురక్ష బస్టాండ్ నుండి సీఎస్పీ సెంటర్ వరకు, జరుగుతున్న భద్రాద్రి ధర్మ పవర్ స్టేషన్ రైల్వే ట్రాక్ నిర్మాణం వల్ల భారీ వాహనాల మళ్లింపు లేక వాహనదారులు పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని , మణుగూరు సామాజిక కార్యకర్త కర్నె రవి అన్నారు. భారీ వాహనాలు ఇసుక వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, బస్టాండ్ నుండి సిహెచ్పి సెంటర్ వరకు అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని ఈనెల 25 వరకు భారీ వాహనాలను రూట్ హనుమాన్ టెంపుల్ నుంచి జియం ఆఫీస్ వైపు నుంచి రోడ్డు మళ్లించి, రోడ్లకు ఇరువైపులా లారీలు ఆపకుండా ప్రమాదాలు జరగకుండా చూడాలని సింగరేణి ఎస్ ఎన్ పి సి అధికారులులను పోలీసు వారిని కోరారు.



# తైలేరియా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ అంజిలప్ప

### పశువులకు సకాలంలో టీకాలను వేయించాలి

### మొగిలిగిద్దలో ఇండియన్ ఇమ్యునిలాజికల్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 :**

గోమార్ల వల్ల పశువులకు సంక్రమించే తైలేరియా వ్యాధి వల్ల జరిగే నష్టాల వల్ల రైతులలు అప్రమత్తంగా ఉండి సకాలంలో పశువులకు టీకాలు వేయించాలని రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ అంజిలప్ప సూచించారు. ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఇమ్యునిలాజికల్ కంపెనీ ఆధ్వర్యంలో పశువులకు తైలేరియా టీకాలను వేశారు ఈ కార్యక్రమాన్ని మొగిలిగిద్ద పశు వైద్యాధికారిని డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ అంజిలప్ప మాట్లాడుతూ.. తైలెరియా టీకాల అవగాహన మరియు ఆవులకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోమార్ల వల్ల పశువులకు సంక్రమించే తైలేరియా వ్యాధి దాని వల్ల జరిగే నష్టాలు రైతులకు వివరించచారు. టీకాలు తీసుకుంటే వచ్చే లాభాలు కూడా వివరించడం జరిగింది. సకాలంలో



టీకాలు తీసుకోకపోతే తైలేరియా వల్ల విష జ్వరాలు ఇతర నష్టాలు సంభవించి చికిత్స అందక పశువులు మృతి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ పి.ప్రసన్న ఇతర పశు వైద్యాధికారులు పాల్గొన్నారు. అధిక విలువ గల సంకర జాతి ఆవులకు తైలేరియ వ్యాధి నివారణ టీకాలు ఇండియన్ ఇమ్యునిలాజికల్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఉచితంగా ఇవ్వడం జరిగిందని ఆమె పేర్కొన్నారు..

# పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో

**నిజాంసాగర్ ,( జుక్కల్ ) ఫిబ్రవరి 9,మరో ఉదయం,**




మొహమ్మద్ నగర్ మండలంలోని హసన్ పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎంపీడీవో నాగేశ్వర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పాఠశాలను తిరిగి పరిశీలించిన అనంతరం రిజిస్టర్ తనిఖీ చేశారు.పాఠశాల హెచ్ఎం శ్రీధర్ జోషి .పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని నూతన పాఠశాల మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# జిపి పాలకవర్గాన్ని, సిబ్బందిని సన్మానించిన గ్రామ ప్రజలు ...

**నిజాంసాగర్ ( జుక్కల్ ) ఫిబ్రవరి 9,మరో ఉదయం.**

నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో సర్పంచ్,ఉప్ప సర్పంచ్, పాలకవర్గం యొక్క పదవీకాలం ముగియడంతో వారిని గ్రామ ప్రజలు గత ఐదు సంవత్సరాల నుంచి గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ గ్రామ మాజీ సర్పంచ్ సంధ్యారాణి,ప్రజా పండరి,ఉపసర్పంచ్ అంజయ్య,ఎంపిటిసి బాలామణి,వార్డు మెంబర్లు,గ్రామప్రత్యేక అధికారి జిపి పాలకవర్గాన్ని సిబ్బందిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు,ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి అమర్ ప్రసాద్,కార్యదర్శి,ఫరీదాబేగం పంచాయతీ సిబ్బంది,మాజీ ఎం పి టి సి రాజారాం, నాయకులు రాములు ,బాబా,తదితరులు ఉన్నారు.



# ఐ ఎన్ టి యు సి యూనియన్ డైరీ ఆవిష్కరణ

**జోగులాంబ**

గద్వాల్ జిల్లా కేంద్రం లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఐ ఎన్ టి యు సి జోగుళాంబ గద్వాల్ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ ఆధ్వర్యం లో ఐ ఎన్ టి యు సి డైరీ 2024 ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ శశికళ మరియు జిల్లా డిప్యూటి డి ఎమ్ హెచ్ ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిద్ధప్ప గార్ల చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రోగ్రామ్ ఆఫీసర్ లు డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ రాజు, సుపరిండెంట్ మునిప్రసాద్, ఏ ఎస్ ఓ తిరుమల రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, జిల్లా యూనియన్ నాయకులు రామకృష్ణ, సాదిక్, అక్కమ్మ, శ్రీనివాసులు,నాగషేశయ్య, అబ్రహం, చంద్రన్న, హనుమంతు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు




# మాజీ ప్రధానికి భారత రత్న ప్రకటించటం తెలుగు జాతికే గర్వం కారణం

### : దేపల్లి అశోక్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 :**

మాజీ ప్రధానికి భారత రత్న ప్రకటించటం తెలుగు జాతికే గర్వం కారణం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్ గౌడ్ అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో శుక్రవారం దేశ మాజీ ప్రధాని కీ. శే. పి.వి నర్సింహ రావు గారి చిత్రా పటానికి పూల మాలలు ఘనంగా నివాళులు అర్పించి, మన తెలుగు బిడ్డ దేశంలో సంస్కరణలు తెచ్చి దేశ అభివృద్ధి పాటుపడిన గొప్ప సంస్కరణ వాదీ కి భారత రత్న ను ప్రకటించడం పట్ల దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కి కృతజ్ఞతలు తెలిపి, స్వీట్లు పంచి వేడుకలు చేసిన బీజేపీ నాయకులు కక్కునూరి వెంకటేష్ గుప్తా,దొడల వెంకటేష్ యాదవ్, మఠం ఋషి,కూర్మయ్య,మలచల్ మురళి,సిరిపురం వెంకట రమణ,భూషణ్,శ్యామ్ సుందర్,కాసోజి శివ,శివ శంకర్, విజయ్,గట్టోజి విజయ్,నక్కల మల్లేష్,డాక్టర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



# 'ఐ హేట్ లవ్'. 'నేనూ ప్రేమలో పడ్డాను'

## 16న విడుదలకు సిద్ధం

సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం 'ఐ హేట్ లవ్'. 'నేనూ ప్రేమలో పడ్డాను' అనేది ఉపశీర్షిక. వెంకటేష్. వి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని డాక్టర్ బాల రావి నిర్మించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను 'గుడుంబా శంకర్' చిత్ర దర్శకుడు వీరశంకర్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఇదే కార్యక్రమంలో చిత్ర విడుదల తేదీని కూడా ప్రకటించారు. ఫిబ్రవరి 16న ఈ చిత్రం థియేటర్లో విడుదల కానుంది.ట్రైలర్ విడుదల చేసిన అనంతరం డైరెక్టర్ వీర శంకర్ మాట్లాడుతూ.. ట్రైలర్ చాలా బాగుంది. సహజత్వంగా చాలా బాగా చిత్రీకరించారని, అన్నివర్గాల వారికి ఈ చిత్రం నచ్చుతుందని అన్నారు. ప్రేక్షకులు మంచి చిత్రాలను ఎప్పుడూ ఆదరిస్తారు. ఫిబ్రవరి 16న వస్తున్న ఈ సినిమాని కూడా ప్రేక్షకులు మంచి సక్సెస్ చేస్తారని కోరుతూ.. చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. నిర్మాత డాక్టర్ బాల రావి మాట్లాడుతూ.. కథ పరంగా ఎక్కడా రాజీపడకుండా అద్భుతంగా తెరకెక్కించాము. గోదావరి ఒడ్డున కూర్చుంటే ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా అంత ప్రశాంతంగా ఆస్వాదించవచ్చని తెలిపారు. కో- ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ మాట్లాడుతూ మంచి చిత్రాలను ఎప్పుడూ ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో ఈ చిత్రం తీశామన్నారు. చిత్ర దర్శకుడు వెంకటేష్. వి మాట్లాడుతూ.. గోదావరి జిల్లా యాసతో పూర్తిగా కోనసీమ పరిసరప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ చేయడం జరిగింది. ఇది యూత్‌ని బాగా ఆకట్టుకునే సందేశాత్మక చిత్రం. పెద్దపల్లి రోహిత్ సంగీతాన్ని అందించారు. పాటలకి మంచి స్పందన వచ్చింది, మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నానని అన్నారు. అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లో ఏస్‌కెయల్‌ఎమ్ మోషన్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదలకానుంది.



# సినిమా వార్తలు



## మేకప్ తీసేసి రమ్మన్న మణిరత్నం సార్

### అలనాటి జ్ఞాపకాలు

### నెమరేసుకున్న ప్రీతిజింటా

బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, మనీషా కొయిరాలా, ప్రీతి జింటా ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'దిల్ సే' ఈ సినిమాకు కోలీవుడ్ స్టార్ దర్శకుడు మణిరత్నం దర్శకత్వం వహించాడు. ఇక ఈ సినిమాతోనే ప్రీతి జింటా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమా విషయాలను గుర్తు చేసుకుంటూ.. 26 ఏండ్ల తర్వాత ఒక స్పెషల్ పోస్ట్ పెట్టింది. ఈ ఫొటోను 'దిల్ సే' మూవీ సెట్‌లో మొదటి రోజు తీశారు. ఈ సినిమాలో అవకాశం రాగానే మణిరత్నం సర్, షారుఖ్ ఖాన్‌లతో పని చేయడానికి ఆత్రుతగా ఎదురు చూశా. మణి సార్ నన్ను ఫస్ట్ చూడగానే నా దగ్గరకి వచ్చి ముఖం కడుక్కొని రమ్మని నవ్వుతూ చెప్పారు. అయితే నేను జోక్ చేస్తున్నారనుకున్నా. సార్? నా మేకప్ పోతుంది అన్నాను. నాకు కూడా కావలసింది అదే.. దయచేసి మీ ముఖం కడుక్కోండి అన్నాడు. దీంతో మేకప్ తీసేశాను. ఆ తర్వాత తీసిన క్లోజప్ షాట్ అద్భుతంగా వచ్చింది. ఈ ఫొటో నా తొలి సన్ని వేశంలోనిది. ఇంత అందమైన ఫొటో తీసిన మా ఫొటోగ్రఫీ డైరెక్టర్ సంతోష్ శివన్‌కు ధన్యవాదాలు అంటూ ప్రీతి జింటా రాసుకోచ్చింది. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## సైలెంట్‌గా సినిమా చేసేస్తున్న అనుష్క



టాలీవుడ్ అగ్ర కథానాయిక, మహిళా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు కేరాఫ్ స్వీటీ అనుష్క ఈ మధ్య సినిమాల్లో నెమ్మదించింది. కథల ఎంపికలో ఎప్పుడు ఆచితూచి అడుగులేస్తుంది. ఏ పాత్ర పడితే అది చేయకుండా వచ్చిన అవకాశాల్లో తనకు ఏది నప్పుతుందో చూసుకుని మాత్రమే సినిమాలు అంగీకరిస్తుంది. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. ఆ తర్వాత తన తాజా చిత్రంపై ఎలాంటి అప్‌డేట్ రాలేదు. అయితే ఆమె తెలుగులో ఇప్పటికే ఓ చిత్రాన్ని సైలెంట్‌గా పట్టాలెక్కించినట్లు తెలిసింది. ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్నట్లు, యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రిష్ శైలికి తగ్గట్టు ఓ బలమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని.. ఛాలెంజింగ్ పాత్రను అనుష్క పోషిస్తుందని ప్రచారం జరుగుతోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాని త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అనుష్క మలయాళంలో 'కథనార్' అనే చిత్రంలో నటిస్తోంది. మలయాళంలో ఆమె నటిస్తున్న తొలి చిత్రమిది. క్రిష్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తో 'హరిహర వీర మల్లు' చిత్రంతో బిజీ గా ఉన్నారు. ప్రస్తుతం పవన్ రాజకీయాలతో బిజీగా ఉండటంతో ఆ చిత్రం డిలే అవుతోంది. ఈ గాప్ లో క్రిష్ ఓ చిత్రం చేయాలనే భావనతో అనుష్కతో సినిమా చేస్తున్నట్లు తెలిసింది



## గజిబిజి గందరగోళంగా ఈగిల్

రవితేజ కథానాయకుడిగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకుడిగా 'ఈగల్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా కూడా పెద్ద బడ్జెట్ మూవీ అవుతుంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్ ఒక ముఖ్యపాత్రలో కనిపించగా, కావ్య థాపర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రచార చిత్రాలు ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఢిల్లీలోని ఒక జాతీయ వార్తాపత్రికలో పనిచేసే జర్నలిస్ట్ నళిని రావు (అనుపమ పరమేశ్వరన్) అనుకోకుండా ఒక చేనేత వస్త్రాన్ని చూస్తుంది, ఆసక్తిగా అది ఎక్కడనుండి వచ్చింది, అది తయారు చేసే వ్యక్తి గురించి ఆరా తీసి ఒక చిన్న వార్తగా పత్రికలో రాస్తుంది. ఆ వార్త చూసిన ఇంటిలిజెన్స్, రా డిపార్టుమెంట్స్ రంగంలోకి దిగి ఆ పేపర్ ఒకరోజు ప్రింట్ అవకుండా అడ్డుకొని, ఆ వార్త ఎలా వచ్చింది, ఎవరు రాసారు అని ఆరా తీస్తారు. పత్రిక యాజమాన్యం ఆ వార్త రాసిన నళినిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తారు. అప్పుడు నళినికి ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలన్న ఆసక్తి పెరిగి మదనపల్లి వచ్చి అక్కడ తన పరిశోధన ప్రారంభిస్తుంది. అక్కడ వున్న పోలీసు అధికారి చెంగల్ రెడ్డి (మిర్చి కిరణ్), ఎంఎల్ఏ (అజయ్ ఘోష్) అతని పిఏ (శ్రీనివాస్ రెడ్డి) వీళ్లందరినీ అడిగితే అతని పేరు సహదేవ్ వర్మ (రవి తేజ) అని తెలుస్తుంది. అతను అక్కడ పత్తిని పండించి చేనేత కార్మికులకు అండగా వున్నాడు అని తెలుస్తోంది. అతని గురించి చాలా లోతుగా పరిశోధన మొదలుపెట్టిన నళినికి సహదేవ్ వర్మ గురించి అనేక ఆసక్తికరమైన అంశాలు తెలుస్తాయి. భారతదేశంతో పాటు విదేశీ ప్రభుత్వాలు కూడా ఈ సహదేవ్ వర్మ గురించి వెదుకుతున్నారని, ఎక్కడో యూరప్‌లో మారణాయుధాలు ఈగల్ పేరుపై దొంగతనంగా సప్లై చేసే అతను.. ఇక్కడ సహదేవ్ వర్మగా ఎందుకున్నాడు? అతని భార్య రచన (కావ్య థాపర్)కి ఏమైంది? అన్నదే కథ. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తీసిన ఈ 'ఈగల్' కూడా కెజిఎఫ్ కోవలోకి వస్తుంది. సినిమా అనుపమ పరమేశ్వరన్ కథ చెప్పడంతో మొదలవుతుంది. అక్కడనుండి ఆమె పరిశోధనకు మదనపల్లె వస్తుంది, ఇక అక్కడనుండి రవితేజ పాత్ర కోసం బిల్డప్ మొదలవుతుంది. కథ ఏమీ లేకుండా వూరికే అందరూ రవితేజ పాత్ర కోసం బిల్డప్ ఇచ్చుకుంటూ వెళతారు. సినిమా మొదలైన 45 నిముషాల వరకు రవి తేజ పాత్ర అసలు తెరమీదకి రాదు. టూకీగా చెప్పాలంటే మారణాయుధాలని దొంగ రవాణా చేసి యూరప్ దేశాల్లో ఈగల్ గా పేరొంది తుపాకీ అద్భుతంగా పేల్చగల వ్యక్తి.. అదే మారణాయుధాలని ఎక్కడ దొంగ రవాణా అవుతున్నా పట్టుకొని తనదగ్గర ఉంచుకుంటాడు, ఎందుకు? దాని వెనకాల వుండే నేపధ్యం ఏమిటి అనేది కథ. వినటానికి చాలా బాగుంది, ఇది బాగా చెప్పొచ్చు కూడా. కానీ దర్శకుడు ఈ కథనే చిలవలు పలవలుగా చేసి, అటు ఇటు తిప్పి, ఎంతసేపూ ఒక్కో సన్నివేశం మీదే దృష్టి పెట్టాడు కానీ, కథ, కథనం మీద సరిగ్గా దృష్టి పెట్టలేదు. రెండో సగంలో రవితేజ, కావ్య థాపర్ మధ్య నడిచే సన్నివేశాలు కథానాయకుడికి తుపాకీ పేల్చడంలో ఎంత ప్రవేశం వుందో చెప్పటం కోసం అన్నట్టుగా తుపాకీతో సమాధానాలు చెప్పించాడు. అలాగే సహదేవ్ వర్మ వుండే ఇంటి దగ్గర ఏమి జరిగింది అనేది చిన్న పిల్లాడితో ఫ్లాష్ బ్యాక్ చెప్పించాడు, అతను గ్రనేడ్స్, గన్స్, పోలీసులు, మిలిటరీ వీటన్నిటి గురించి చెప్పేస్తూ ఉంటాడు. ఇలాంటివి విచిత్రాలు చాలా వున్నాయి సినిమాలో. రా చీఫ్ మధుబాల, డిఫెన్స్ మినిస్టర్, మిగతా ఇంటిలిజెన్స్ సభ్యులు అందరూ ఢిల్లీలో ఒక గదిలో మదనపల్లిలో జరిగే విధ్వంసాన్ని సీసీ కెమెరాల్లో చూస్తూ ఉలిక్కిపడుతూ వుంటారు. అలాగే కొన్ని కొన్ని సన్నివేశాలు మరీ నవ్వు తెప్పిస్తాయి. అనుపమ మదనపల్లిలో ఉంటుంది, ఏదో తెలుసుకోవాలంటే అజయ్ (నవదీప్)ని అడగాలి అంటారు, వెంటనే పోలాండ్ రాజధాని వార్సాలో నవదీప్ తో మాట్లాడుతూ కనిపిస్తుంది. దర్శకుడు కథని వెనక్కి, ప్రస్తుతానికి.. మళ్ళీ వెనక్కి ఇలా సరిగ్గా చెప్పలేకపోయాడు అనిపిస్తుంది. కథను నేరుగా వెండితెర పైన అర్థం అయేటట్టు చూపిస్తే బాగుండేమో అనిపిస్తుంది.

Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com